క్లుప్తంగా

'అర్చకుడిపై చర్యలు తీసుకోవాలి'

ఆత్మకూర్: దళితుల పెళ్లిని అడ్డుకొని అవమానపర్చిన పూజారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మాగనూర్ మండలంలోని ముడుమాల్‌లోని యాదావేంద్ర మఠంలో దళిత జంట వివాహాన్ని పూజారి చక్రపాణి అడ్డుకుని ఆలయం బయట జరుపుకోవాలని హుకుం జారీ చేయడం నీచమైన చర్యగా అభివర్ణించారు. పూజారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దండు శ్రీనివాస్, కృష్ణమాదిగ, సోంబాబు, మాసన్న, కుర్మన్న, రాజు, అంజి, పరమేష్, శేఖర్, దశరథ, మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి ఉత్సవాలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వీరభద్రుడి ఉత్సవాలను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి వీరన్న గుట్టపై ఉన్న స్వామి వారి ఆలయంలో అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని వాసనాగేశ్వర్ ఇంటి నుంచి స్వామివారి పల్లకీ సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి పల్లకీ సేవ వద్ద భక్తులు భజనలు, భక్తిగీతాలు ఆలపించారు. మహిళలు బొడ్డమ్మలు ఆడుతూ గుట్టపై ఉన్న ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరిగి వాసనాగేశ్వర్ ఇంటికి స్వామి వారిని చేర్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చెత్త బుట్టలు పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామ పంచాయతీకి సోమవారం రిసార్ట్ యాజమానులు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత కోసం తమ బాధ్యతగా బుట్టలు అందించినట్లు భరత్, శివకుమార్, దిలీప్, రఘులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి సాధిక్, మాజీ సర్పంచ్ మద్దిలేటి, పంచాయతీ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని నిరసన



కొల్లాపూర్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి శివవర్మ మాట్లాడుతూ చాలా గ్రామాలకు బస్సులు రాకపోవడంతో ఉచిత ప్రయాణానికి మహిళలు దూరమవుతున్నారన్నారు. ఆరు గ్యారంటీల అమలు కోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సలీం, చంద్రునాయక్, సురేందర్ తదితరులున్నారు.

రోడ్డు బాగోలేక.. బస్సులు బంద్



కోడేరు: పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా తీగలపల్లి నుంచి రాయిపాకుల మీదగా నాగర్‌కర్నూల్ వరకు ఉన్న బీటీ రోడ్డు ప్రాజెక్టులో మునిగిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు డ్యాం కట్టపై తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. ఈ రోడ్డుగుండా బస్సులు రాకపోకలు కొనసాగేవి. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు బురద మయంగా మారింది. దీంతో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ డిపో అధికారులు బస్సులను వారం రోజుల నుంచి నిలిపివేశారు. కొల్లాపూర్ డిపో బస్సులు కోడేరు నుంచి తీగలపల్లి వరకు మాత్రమే రాకపోకలు కొనసాగుతున్నాయని ప్రయణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి డ్యాం కట్టపై ఉన్న రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎర్రవల్లి: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాష అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ వసతి గృహంతో పాటు ధర్మవరంలోని బీసీ వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వసతి గృహాల్లో నూతన వంట గదుల ఏర్పాటు, డార్మేటరీలో కిటికీలు, తలుపులు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిచాలని ఆయన కోరారు. ఆయన వెంట వెంకటేష్, నవీన్, మురళి, మనోజ్, దినేష్ ఉన్నారు.



వీపనగండ్లలో అంగన్‌వాడీ కేంద్రంలో..



అమరచింత అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల వేషధారణ



పెబ్బేరులో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు



పాన్‌గల్‌లో విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

ఆత్మకూర్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం రాత్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఊరేగింపు నిర్వహించి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉట్టి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉట్టిని కొట్టే కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హజరయ్యారు. ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు శాగాపూర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం సమీపంలో ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. విజేతగా నిలిచిన చరణ్‌యాదవ్‌కు ఆలయ కమిటీ తరపున రూ.1500 నగదు బహుమతి అందజేశారు.

వనపర్తి రూరల్: త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణ వీధుల్లో శ్రీకృష్ణ భగవానుడిని ఊరేగింపు చేశారు.



మదనాపురంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌యాదవ్ పాల్గొని పల్లకీని మోశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోలాటం, జయ కృష్ణ నినాదాలతో, భగవద్గీత శ్లోక ఉచ్చారణలతో ఊరేగింపు తీశారు. కార్యక్రమంలో రాములు యాదవ్, వెంకట్రాములు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, రవి, వెంకటేశ్వర్లు, హుజూర్, రంగస్వామి, సమత, విజయలక్ష్మి, వరలక్ష్మి, సంధ్య, లావణ్య, త్రైతేశ్వర్, అక్షయ, మిత్రేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురంలో..

మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో ఆట పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. పాఠశాలలో చిన్నారులతో ఉత్సాహంగా కర్రలతో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్ మంజులారాణి, తల్లులు సువర్ణ, గాయత్రి, రవళి, కవిత పాల్గొన్నారు.

వీపనగండ్ల: బొల్లారం, రంగవరం, వీపనగండ్ల తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, మహేశ్వరి, ఎల్లమ్మ, సువర్ణ, చంద్రకళ, భారతి, అంగన్‌వాడీ హెల్పర్లు లచ్చమ్మ, నీరజ, చెన్నమ్మ పాల్గొన్నారు.



అమరచింతలో ఉట్టి కొడుతున్న విద్యార్థి



పెబ్బేరులో..

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం యాదవులు ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించి ఉట్టి కొట్టే ప్రదేశానికి వెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో కృష్ణ, గోపికల వేషాధారణలతో అలంకరించగా, విజేత, సరస్వతి శిశుమందిరాలలో ఉట్టి కొట్టే ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తి మండలంలోని కడుకుంట్లలో..



ఆత్మకూర్‌లో ఉట్టిని లాగుతున్న నాయకులు



ఆత్మకూర్‌లో వేడుకలకు హాజరైన ప్రజలు



శ్రీరంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో..

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



అమరచింతలో మదర్‌థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కేశం నాగరాజ్‌గౌడ్ తదితరులు


వనపర్తిటౌన్: అన్నార్థులకు అండగా, రోగ పీడితులకు మాతృమూర్తిగా సేవలందించి, నిరుపేదల ఆకలి కేకల బాధలు తీర్చిన నిస్వార్థ మానవతావాది మదర్‌థెరిస్సా అని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకొని సోమవారం మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. మదర్‌థెరిస్సా తరతరాలకు చెరగని ప్రేమ సంపదను మానవాళికి అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కవులు గిరి రాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, నాయకులు మండ్ల దేవన్ననాయుడు, బాలేమియా, తగవుల వెంకటస్వామి, క్రాంతి కుమార్, వెంకటేష్, రాంబాబు, రాముడు, కృష్ణయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: ప్రతి ఒక్కరూ ఆపద సమయంలో ఉన్న ఇతరులకు సేవ చేసే గొప్ప గుణం కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, ఎస్‌ఐ సురేష్ అన్నారు. మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో నవోదయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నవోదయ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నిరుపేదలకు చీరలు, బట్టలు పంపిణీ చేశారు.

తల్లిదండ్రులను విస్మరించొద్దు

కని, పెంచిన తల్లిదండ్రులను విస్మరించడం శోచనీయమని, తల్లిదండ్రులకు సేవ చేయలేని వారు ఉన్నా.. లేనట్లే అని కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు తమ కొడుకులు పట్టించుకోవడం లేదని పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నవోదయ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శ్యాంసుందర్, శ్యాంసోన్, నాయకులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, అజయ్, పోసిరిగారి విష్ణు, హన్మంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



రేచింతలలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శివకుమార్



అమరచింతలో..

ఆత్మకూర్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. సోమవారం మండలంలోని రేచింతలలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం గ్రామస్తులు, దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు బీచుపల్లి, రోషయ్య, సిబ్బంది బాల్‌రాజు, రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరచింత: సీసీ కెమెరాలతో ఏర్పాటుతో నేరాలను అదుపు చేయొచ్చని ఎస్‌ఐ సురేష్ అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై వ్యాపారులు, యువకులకు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలు, చోరీలు జరిగినప్పుడు నిందితులను వేగంగా పట్టుకునేందుకు వీలవుతుందన్నారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానించడం ద్వారా ప్రతి నిత్యం పోలీసుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ జమీరుద్దీన్ పాల్గొన్నారు.

రహదారి మరమ్మతు చేయించండి



ప్రమాదకరంగా వల్లభాపురం రోడ్డు

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి వల్లభాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో భీమా కాల్వకు రోడ్డు సమీపంగా ఉండి పూర్తిగా పాడవడంతో ప్రమాదం పొంచి ఉంది. 8 కిలో మీటర్ల బీటీ రోడ్డును గతేడాది పూర్తి చేయించిన అధికారులు మండల కేంద్రానికి సమీపంలో 200 మీటర్ల రోడ్డును పూర్తి వదిలేయడంతో వాహనదారులు, పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



అమరచింత: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు రూ.8వేల కోట్లు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులను కళాశాలల నుంచి ఇంటికి పంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2021-22 విద్యా సంవత్సరం నుంచి స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీటిని చెల్లించడంలో నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సోయబ్, నవాబ్, మహిబ్, విశాల్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించాలి



గోపాల్‌పేట: వినాయక చవితి ఉత్సవాలను యువకులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని రేవల్లి ఎస్‌ఐ రాము సూచించారు. సోమవారం ఆయన రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో మండల యువకులతో సమావేశం నిర్వహించారు. మట్టి వినాయకులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, డీజేలు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని కోరారు. మండపం వద్ద కరెంటు తీగలు కిందకు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నిరుపయోగంగా క్రీడా మైదానం

కొత్తకోట రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి క్రీడా మైదానాలను ఏర్పాటు చేయగా.. అవి కాస్త ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. గతంలో పట్టణాలు, జిల్లా కేంద్రాలకు పరిమితమైన క్రీడా మైదానాలు పల్లెలకు విస్తరించేలా గత ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో అధికారులు రెండేళ్ల కిందట స్థలాలు గుర్తించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని చిలకటోనిపల్లిలో స్థలం లేకపోవడంతో ఎన్‌హెచ్44కు పక్కన క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. మైదానంలో ఏర్పాటు చేసిన వస్తువులు నిరుపయోగం మారడంతో పాటు తుప్పు పట్టాయి. క్రీడా మైదానాన్ని గ్రామానికి సుమారు కిలోమీటరు దూరం ఉండటంతో గ్రామ యువకులు, విద్యార్థులు క్రీడా మైదానానికి వెళ్లిన సందర్భాలే లేవు. రూ.లక్షల ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేసి క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసినా.. ఎవరికి ఉపయోగ పడకపోవడంతో అధికారుల, పాలకుల పనితీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆసరా పింఛన్ల కోసం పడిగాపులు



పాన్‌గల్: మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద ఆసరా పింఛన్ల కోసం లబ్ధిదారులకు పడిగాపులు తప్పట్లేదు. సోమవారం పింఛన్లు పంపిణీ చేస్తున్నారనే విషయం తెలుసుకున్న మండల కేంద్రంలోని ఆసరా లబ్ధిదారులు కార్యాలయానికి చేరుకున్నారు. నెట్‌వర్క్, సర్వర్ సమస్యతో పంపిణీలో ఆలస్యం అవుతుందని పోస్టాఫీసు అధికారులు చెబుతున్నారు. కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. 27మందికి మంజూరైనా చెక్కులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఇవ్వాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచించడంతో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చెక్కులను అందజేశారు. తమ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రావడానికి కృషి చేసిన కాంగ్రెస్ నాయకులకు, ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపయ్యగారి కృష్ణారెడ్డి, ఎన్‌జే బోయేజ్, డాక్టర్ పీజే బాబు, వేముల శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, సలీంఖాన్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, లక్ష్మయ్యయాదవ్, రంగారెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన నర్సింహారెడ్డికి రూ.19,500, గుంటి భాస్కర్‌కు రూ 42 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచన మేరకు స్థానిక నాయకులు ఆర్ నరేందర్‌రెడ్డి సోమవారం గ్రామంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, గుంటి గోపి, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



సీసీ రహదారిని తవ్వేశారు

సీసీ రహదారిని తవ్విన అధికారులు

అమరచింత: కాలనీల్లో నిలిచిన వర్షపు నీటిని తరలించేందుకు సీసీ రహదారిని తవ్విన ఘటన మూడో వార్డులో చోటుచేసుకుంది. పట్టణంలోని కాళికామాత ఆలయ సమీపంలో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారడం, సమీపంలోని ఇళ్ల నుంచి వస్తున్న మురుగున సైతం అక్కడే నిలుస్తుందని కాలనీవాసులు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేక.. ఉన్న సీసీ రహదారిని తవ్వి మురుగునీటిని మళ్లించే యత్నం చేసిన అధికారుల నిర్వాకంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతుంది.

రెండేళ్ల కొడుకుతో తల్లి అదృశ్యం

రాజోళి: రెండేళ్ల కొడుకుతో తల్లి అదృశ్యమైన సంఘటన మండలంలోని మాన్‌దొడ్డిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీష్ వివరాల ప్రకారం.. మాన్‌దొడ్డికి చెందిన కుమ్మరి నాగరాజుకు ఎనిమిదేళ్ల క్రితం పావనితో వివాహమైంది. ఏడాది క్రితం భార్యతో కలిసి జీవనోపాధి కోసం బెంగుళూరు వెళ్లి, కొద్ది రోజుల క్రితం తిరిగొచ్చి గ్రామంలోనే ఉంటున్నారు. వారికి ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు విశాల్ ఉన్నారు. ఈ నెల 23న రెండేళ్ల కుమారుడితో ఇంట్లో నుంచి పావని వెళ్లిపోయింది. ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదు. వారి బంధువులు, సన్నిహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త నాగరాజు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.